నాణ్యత విషయంలో రాజీ వద్దు

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

అభివృద్ధి పనుల విషయంలో రాజీ పడకుండా నాణ్యతగా చేపట్టాలని ఎంపీ మార్గాని భరత్‌రామ్ గుత్తేదారులకు, పనులు పర్యవేక్షిస్తున్న నగర పాలక సంస్థ ఇంజినీరింగ్ అధికారులు, సిబ్బందికి సూచించారు. కంబాల చెరువు వద్ద రూ.60 లక్షలతో చేపట్టిన రహదారి అభివృద్ధి పనులను ఆయన ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా మున్సిపల్ ఎస్‌ఇ పాండురంగారావుకు ఎంపీ పలు సూచనలిచ్చారు. నగరంలో ప్రధాన రహదారులన్నీ పరిశీలించి..ఎక్కడా ప్రజలకు అసౌకర్యం కలగకుండా అవసరమైన అభివృద్ధి పనులు చేపట్టాలన్నారు. పలుచోట్ల ఫిట్ చేసిన టైల్స్ కొన్ని పైకి లేచిపోయాయని, సిమెంట్ సరిగా అంటుకోకపోవడం వల్లనే అని అనేక ఫిర్యాదులు వచ్చాయన్నారు. వీటిని పరిశీలించాలని ఎస్‌ఇకి భరత్ సూచించారు. ఆయన వెంటన వైసిపి నగర అధ్యక్షుడు శ్రీహరి ఉన్నారు.

విద్యార్థులకు కార్పొరేట్ వల

- పది పరీక్షలకు ముందుగానే అడ్మిషన్ల వేట
- తల్లిదండ్రులకు ఫోన్, ఎస్ఎంఎస్‌ల హోరు
- కార్పొరేట్, ప్రయివేటు విద్యాసంస్థల జోరు

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం ప్రతినిధి

పదో తరగతి పరీక్షలు ప్రారంభానికి ముందే కార్పొరేట్, ప్రయివేట్ విద్యా సంస్థలు విద్యార్థులకు వల వేస్తున్నాయి. కళాశాలల ప్రతినిధులు ఏకంగా గ్రామాల్లో మధ్యవర్తులను పెట్టుకుని, విద్యార్థుల తల్లిదండ్రులను కలిసి కాలేజీల ప్రత్యేకతలను వివరిస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యనభ్యసిస్తున్న విద్యార్థుల తల్లిదండ్రుల నెంబర్లు సేకరించి మొబైల్‌ఫోన్లకు ఎస్ఎంఎస్‌లు, ఫోన్లు చేస్తూ ఊదరగొడుతున్నారు. ఎలాగోలా బుట్టలో వేసుకునేందుకు తీవ్ర ప్రయత్నాలు సాగిస్తున్నారు. సీటు రిజర్వ్ చేసుకుంటే రాయితీలిస్తామని చెబుతున్నాయి. వివిధ కోర్సులను ప్యాకేజీగా రూపొందించి 20 నుంచి 40 శాతం వరకూ ఆఫర్ చేస్తున్నాయి. విద్యార్థుల స్థాయిని బట్టి అడ్మిషన్లు సేకరిస్తున్నాయి.

వివరాలు మొత్తం సేకరించి..

ఏప్రిల్‌లో పదో తరగతి పరీక్షలు ప్రారంభం కానున్నాయి. తల్లిదండ్రులు తమ పిల్లలను ఏ కాలేజీలో చేర్చాలోనన్న ఆలోచనలు ప్రారంభమయ్యాయి. గత రెండేళ్ల ప్రభుత్వ విద్యా సంస్థలు ఫలితాలు తలకిందులైన విషయం విదితమే. ఈ నేపథ్యంలో ఆర్థిక పరిపుష్టత లేకపోయినా పిల్లల భవిష్యత్తు కోసం అప్పులు చేసైనా మంచి కాలేజీలో చేర్పించాలని తల్లిదండ్రులు యోచిస్తున్నారు. దీనిని క్యాష్ చేసుకునేందుకు కార్పొరేట్, ప్రయివేటు కాలేజీల నిర్వాహకులు ప్రయత్నాలు ముమ్మరం చేస్తున్నారు. విద్యార్థులను ఎలాగైనా తమ కళాశాలలో చేర్చుకునేందుకు ఇంటింటా, ఫోన్, ఎస్ఎంఎస్‌ల ద్వారా అప్పుడే ప్రచారం మొదలు పెట్టారు. బుట్టలో వేసుకునే ప్రయత్నాలు చేస్తున్నారు. తమ కళాశాలలో ఉత్తమ బోధనతోపాటు ఫలానా ప్రత్యేకతలు ఉన్నాయని, చేరితే రాయితీలు ఇస్తామంటూ ఊదరగొట్టేస్తున్నారు. విద్యార్థుల చిరునామా, ఫోన్ నెంబర్లు ప్రయివేటు సంస్థల ప్రతినిధులు. ఆయా పాఠశాలల నుంచి ఇప్పటికే సేకరించారు. ఆ విద్యార్థి మార్కులు, కుటుంబ ఆర్థిక స్థోమతను తెలుసుకున్నారు. ఈ నేపథ్యంలో ప్రైవేటు సంస్థల ప్రతినిధులు, స్థానికంగా నియమించుకున్న మధ్యవర్తుల ద్వారా నేరుగా విద్యార్థుల తల్లిదండ్రుల వద్దకు వెళ్తున్నారు. తమ కళాశాలలో చేర్చితే ఫీజు రాయితీ ఇస్తామనీ, సౌకర్యాలు కల్పిస్తామనీ, పలు పోటీ పరీక్షలకు శిక్షణ ఇస్తామనీ, ఆలస్యం చేస్తే సీట్లు దొరకవని ఊదరగొడుతున్నారు. మరో వైపు ఉపాధ్యాయుల ద్వారా గాలం వేస్తున్నారు.

> **అడ్మిషన్లకు షెడ్యూలు ప్రకటించలేదు**
>
> ఇంటర్మీడియట్ అడ్మిషన్లకు బోర్డు నుంచి ఎటువంటి ఆదేశాలు రాలేదు. షెడ్యూలు ప్రకటించిన అనంతరమే అడ్మిషన్లు తీసుకోవాలి. బోర్డు నుంచి అనుమతులు రాకముందే అడ్మిషన్ల ప్రక్రియ చేపడితే చర్యలు తప్పవు. ప్రైవేట్, కార్పొరేట్ సంస్థల యాజమాన్యాలు నిబంధనలను తప్పనిసరిగా అనుసరించాలి.
>
> **- ఎన్ఎస్‌విఎల్ నర్సింహం, ఆర్ఐఒ, తూర్పుగోదావరి జిల్లా**

ఎవరి డప్పు వారిది..

రాజమహేంద్రవరం, కాకినాడలతో పాటు విజయవాడ, విశాఖపట్నం విద్యాసంస్థలు ప్రత్యేకంగా మధ్యవర్తులను నియమించుకుని, వారి ద్వారా ప్రచారం చేస్తున్నాయి. రాష్ట్ర వ్యాప్తంగా తమ సంస్థలు ఉన్నాయని, జిల్లాలోనే కళాశాల శాఖ ఉందనీ, చేరాలని ఒత్తిళ్లు తెస్తున్నారు. కార్పొరేట్ సంస్థలకు తామేమీ తక్కువ కాదని జిల్లాలోని పలు ప్రయివేటు కళాశాలలు కూడా విద్యార్థులపై వల వేస్తున్నాయి. ఈ ప్రచారంలో తమ కళాశాలలో ప్రత్యేకంగా ఎంసెట్, ఎఐఇఇఇ, ఐఐటి, జెఇఇ మెయిన్స్, ఎన్ఐటి శిక్షణ ఇస్తామని, పిల్లలకు బంగారు భవిష్యత్తు ఉంటుందని ఆశ చూపుతున్నారు. కళాశాలలో ఎసి, నాన్ ఎసి, డేస్కాలర్, హాస్టల్, మెస్ తదితర ప్రత్యేకతలు వినిపిస్తూ విద్యార్థుల తల్లిదండ్రులను ఆకర్షిస్తున్నారు. వెంటనే డబ్బు చెల్లించి, సీటు ఖరారు చేసుకోవాలని ఒత్తిళ్లు తెస్తున్నారు. మెరుగైన మార్కులు సాధించిన వారికి ప్రత్యేక రాయితీలు అంటూ నమ్మించే ప్రయత్నం చేస్తున్నారు. ఈ ప్రచారంతో విద్యార్థుల తల్లిదండ్రులు ఎటూ తేల్చుకోలేకపోతున్నారు. ప్రైవేటు, కార్పొరేట్ కళాశాలల మాయమాటలు నమ్మి, కొందరు పిల్లలను చేర్పించేస్తున్నారు. మరి కొందరు కళాశాల చూసిన తరువాత చెబుతామని బదులు ఇస్తున్నారు. ముందుగా చేరితే ఫీజులో రాయితీ ఇస్తామని సంస్థలు చెబుతున్నాయి. ఫీజులు కూడా రూ.లక్షల్లో డిమాండ్ చేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి.

నివాళులర్పిస్తున్న ఎంఎల్‌సి సాబ్జీ తదితరులు

నాయకుల త్యాగలతోనే యుటిఎఫ్ ఆవిర్భావం

పిడిఎఫ్ ఎంఎల్‌సి షేక్ సాబ్జీ

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

ఎంతో మంది ఉపాధ్యాయ నేతల త్యాగాల ఫలితంగా ఐక్య ఉపాధ్యాయ సంఘం(యుటిఎఫ్) ఏర్పడిందని పిడిఎఫ్ ఎంఎల్‌సి షేక్ సాబ్జీ పేర్కొన్నారు. యుటిఎఫ్ ఉద్యమ నిర్మాతలు అప్పారి వెంకటస్వామి, వత్సవాయి సూర్యనారాయణ రాజు వర్థంతిని ఆదివారం విటి డిగ్రీ కళాశాల ఆడిటోరియంలో నిర్వహించారు. యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు పి.జయకర్, ఎ.షరీఫ్ నేతృత్వంలో ఈ కార్యక్రమం జరిగింది. ఎంఎల్‌సి సాబ్జీ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. అప్పారి, సూర్యనారాయణరాజు చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ ఎంతో కష్టపడి ఉద్యమ నాయకులు తమ జీతాలు, జీవితాలు సైతం పణంగా పెట్టి ఉపాధ్యాయ హక్కులు సాధించారన్నారు. హక్కులను పరిరక్షించుకోవడానికి ఉపాధ్యాయులంతా చైతన్యంతో ఉద్యమాలకు, పోరాటానికి సంసిద్ధులుగా ఉండాలని ఆయన పిలుపునిచ్చారు. ప్రభుత్వం చేస్తున్న కార్యక్రమాలతో ప్రాథమిక విద్యా వ్యవస్థ పేదలకు దూరమవుతోందని ఆయన పేర్కొన్నారు. దేశం, రాష్ట్రంలోని జరుగుతున్న ప్రజా వ్యతిరేక విధానాలను తిప్పి కొట్టాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. ఎల్ఐసి ఉద్యోగుల సంఘ ఆలిండియా కార్యదర్శి పి.సతీష్ మాట్లాడుతూ ప్రశ్నించిన గొంతులకు ఇనుప సంకెళ్లు పడుతున్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. సామాన్యుల శ్రమను కొందరు కార్పొరేట్లు ప్రభుత్వ పెద్దల సహకారంతో సునాయాసంగా దోచేస్తున్నారన్నారు. యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు జయకర్ మాట్లాడుతూ ప్రభుత్వం అవలంబిస్తున్న విద్యా వ్యతిరేక ధోరణుల్ని తిప్పికొట్టాలన్నారు. ప్రధాన కార్యదర్శి షరీఫ్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల పరిరక్షణకు యుటిఎఫ్ చేపట్టిన ఉద్యమాలను వివరించారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ సాంస్కృతిక దళం ఆలపించిన ఉద్యమ గీతాలు అందర్నీ ఆలోచింపజేశాయి. యుటిఎఫ్ జిల్లా కోశాధికారి ప్రసాద్, జిల్లా అసోసియేట్లు ఎం విజయ గౌరీ, ఐ రాంబాబు తదితరు పాల్గొన్నారు.

విజయనిర్మలకు 'విశ్వరూపిణి' అవార్డు

ప్రజాశక్తి -దేవరపల్లి

దేవరపల్లికి చెందిన నవచైతన్య యువజన సంఘం సంస్థ ప్రతినిధి, నారీ శక్తి పురస్కార్ రాష్ట్రపతి అవార్డు గ్రహీత విజయ నిర్మలకు విశ్వరూపిని అంతర్జాతీయ ఉత్తమ మహిళా అవార్డు దక్కింది. హైదరాబాద్‌లోని తెలంగాణ సారస్వత పరిషత్ కళామందిరంలో ఆర్ట్ ఆఫ్ లర్నింగ్ సంస్థ వారి ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో ఆమె ఈ అవార్డును స్వీకరించారు. సామాజిక సేవారంగంలో చేసిన సేవలకు, మహిళల అభివృద్ధికి తీసుకున్న చర్యలకు ఆమెకు విశ్వరూపిణి అంతర్జాతీయ ఉత్తమ మహిళా అవార్డు మరియు లెజెండ్ ఆఫ్ సోషల్ వర్క్, లైఫ్ టైం అచీవ్‌మెంట్, మదర్ థెరిసా అవార్డులు దక్కాయి. అంతేకాకుండా ఆమె పేరును విక్టరీ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో ప్రత్యేక ఉన్నత స్థానంలో నమోదు చేస్తూ ధ్రువీకరణ పత్రాన్ని అందజేశారు.

అవార్డు ఇచ్చి సత్కరిస్తున్న నిర్వాహకులు

సమస్యలను తక్షణమే పరిష్కరించాలి

తాళ్లపూడి : ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని యుటిఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. తాళ్లపూడి శ్రీ పరస పద్మనాచారావు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో యుటిఎఫ్ సమావేశం ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా పలువురు ఉపాధ్యాయులు మాట్లాడారు. ఒకటి నుంచి 5వ తరగతి వరకు క్లాసులు ఎలిమెంటరీ పాఠశాలలోనే కొనసాగించాలన్నారు. మధ్యాహ్న భోజన పథకం, శానిటరీ నిధుల నుంచి ఉపాధ్యాయులకు మినహాయింపు ఇవ్వాలన్నారు. టి.క్రాంతికుమార్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో జిల్లా కార్యదర్శి ఎం.రవి మండల ప్రధాన కార్యదర్శి టి.నాగేశ్వరరావు, మహిళా అధ్యక్షులు కృష్ణవేణి, సీనియర్ నాయకులు బి.విజయబాబు పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధే ముఖ్యం

ప్రజాశక్తి-కడియం

తమ గ్రామ అభివృద్ధే ముఖ్యమని, గ్రామానికి రావాల్సిన ఆర్థిక వనరుల కోసం కుల, మత, రాజకీయాలక తీతంగా ఏకతాటికి వచ్చి శాంతియుత నిరసన తెలిపేందుకు గ్రామస్తులు సిద్ధమవుతున్నారు. స్థానికుల సమాచారం మేరకు పంచాయతీకి పన్నుల రూపేణా అధిక ఆర్థిక ఆదాయం వచ్చేది జివికె పవర్ ప్రాజెక్టు నుంచే. ఈ పరిశ్రమ ద్వారా 1986 నుంచి 2018 వరకూ ప్రతి ఏడూ ఆర్థిక సంవత్సరం ముగింపు నాటికి 3 నెలల ముందుగానే పన్నుల రూపేణా ఆదాయం సమకూరేది. జివికె రాష్ట్ర ప్రభుత్వంతో కుదుర్చుకున్న పిపిఎ ఒప్పందం 2018తో ముగిసింది. ఎపిఇపిడిసిఎల్ విద్యుత్ సంస్థకు ఫస్ట్ ఫేజ్ పవర్ ప్లాంట్‌ని అప్పగించారు. అనంతరం ఎపిఇపిడిసిఎల్‌కు అనుబంధ సంస్థ అయిన ఎపి జెన్‌కోకు సంబంధించిన జిజిపిపి(గోదావరి గ్యాస్ పవర్ ప్రాజెక్ట్)కు అప్పగించారు. గత ఆర్థిక సంవత్సరం వరకూ యథావిధిగా పంచాయతీకి పన్నులు చెల్లింపులు జరిగాయి. కాని ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2022-2023) ముగుస్తున్నా పన్ను చెల్లింపు చేయకుండా ఎపిఇపిడిసిఎల్ అధికారులు కాలయాపన చేస్తున్నారు. పంచాయతీ ద్వారా నోటీసులిచ్చినా స్పందిం చడం లేదని గ్రామస్తులు చెబుతున్నారు. దీనిపై పోరాటం చేసే ఆలోచనలో ఉన్నట్టు పలువురు గ్రామస్తులు చెబుతున్నారు. ఈ విషయంపై సర్పంచ్ యాదల సతీష్ చంద్రస్టాలిన్‌ను వివరణ కోరగా పంచాయతీకి ప్రధాన ఆదాయ వనరులపై దెబ్బ తీసే పనులు ఎవ్వరు చేసినా గ్రామస్తులతో కలిసి ప్రజా ఉద్యమానికి ముందుంటామన్నారు. పంచాయతీని కాపాడుకుంటామని తెలిపారు.

ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని ఆ సంఘం జిల్లా సమావేశంలో నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక పేపర్ మిల్లు వద్ద గల బిటిఆర్ భవన్‌లో జాతీయ ఆరోగ్య మిషన్ ఉద్యోగుల జిల్లా సమావేశం జరిగింది. ఈ సమావేశంలో మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర నాయకులు పలివెల శ్రీనివాస్ మాట్లాడారు. ఎన్‌హెచ్‌ఎం పథకంలో రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 50 వేల మంది ఉద్యోగులు పనిచేస్తున్నారన్నారు. వీరికి కనీస వేతనాలు అమలు కావడం లేదన్నారు. పర్మినెంట్ ఉద్యోగులతో సమానంగా పనిచేసిన వారికి ఇచ్చే వేతనాలు అంతంత మాత్రమే అన్నారు. సెలవులు, ఇఎస్ఐ, పిఎఫ్ వంటివి అమలవ్వటేలదని తెలిపారు. ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల సంఘం జెఎసి చైర్మన్ దయామణి మాట్లాడుతూ ఎన్‌హెచ్‌ఎంలో పనిచేస్తున్న ఉద్యోగులంతా సమస్యలు పరిష్కారం కోసం ఐక్యంగా ఉండాలన్నారు. ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల సంఘం ఎన్నో సమస్యలపై పోరాటాలు చేసిందన్నారు. కొన్ని సమస్యలు పరిష్కరించగలిగిందని, వేతనాల పెంపు, రెగ్యులరైజేషన్, ఎన్‌హెచ్‌ఎంలో పనిచేస్తున్న అన్ని విభాగాల ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి బి.రాజులోవ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఇటీవల ప్రవేశపెట్టిన బడ్జెట్లో వైద్య రంగానికి తగినన్ని కేటాయింపులు చేయలేదన్నారు. వైద్య రంగానికి కేటాయింపులు పెంచాలని, ఆ రంగంలో పనిచేస్తున్న ఉద్యోగులకు వేతనాలు పెంచాలని, సమాన పనికి సమాన వేతనం, సమాన సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో వైద్య ఆరోగ్యశాఖలో వేల సంఖ్యలో ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయని, ఆ స్థానాల్లో కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ పద్ధతుల్లో పనిచేస్తున్న వారిని రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సతీష్, రాజశేఖర్, వెంకటలక్ష్మి, నవీన్ కుమార్, మంగాదేవి, దేవిలను ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల సంఘం జిల్లా అడహక్ కమిటీగా ఎన్నుకున్నారు.

అడహక్ కమిటీతో నాయకులు రాజులోవ, శ్రీనివాస్ తదితరులు

'ఆసరా'ను జయప్రదం చేయాలి

ప్రజాశక్తి - గోపాలపురం

గోపాలపురం ఎఎంసి ఆవరణంలో సోమవారం జరిగే వైఎస్ఆర్ ఆసరా 3వ విడత చెక్కుల పంపిణీ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని వైసిపి మండల అధ్యక్షులు పోతిరెడ్డి నాగరాజు పిలుపునిచ్చారు. ఆదివారం ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎంఎల్‌ఎ తలారి వెంకట్రావు హాజరవుతారని తెలిపారు. మండలంలోని సర్పంచులు, ఎంపిటిసి సభ్యులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొని ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఆయన కోరారు

ఈలి ప్రసాద్‌కు పరామర్శ

ప్రజాశక్తి-కడియం

కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న మండలంలోని పొట్టిలంక గ్రామానికి చెందిన ఈలి ప్రసాద్‌ను డిసిసిబి చైర్మన్ ఆకుల వీర్రాజు ఆదివారం పరామర్శించారు. ఆరోగ్యంపై ఆరా తీశారు. యోగ, క్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట రాష్ట్ర శాప్ డైరెక్టర్ భీమిరెడ్డి నాగేంద్ర, కొత్తపల్లి వెంకటేశ్వరరావు ఉన్నారు.

నేటి నుంచి మొబైల్ ఆధార్ సేవలు

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

మండలంలోని వడ్లూరు, సత్యవాడ గ్రామాల్లో నేటి నుంచి మొబైల్ ఆధార్ ప్రత్యేక క్యాంపులు నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఒ ఎ.శ్రీనివాస్ తెలిపారు. 27న వడ్లూరు, 28, 29 తేదీల్లో సత్యవాడ గ్రామంలో మొబైల్ ఆధార్ ప్రత్యేక క్యాంపులు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఆయా గ్రామాల ప్రజలు తమ ఆధార్ కార్డులలో మార్పులు, చేర్పులు చేయించుకోవచ్చున్నారు.

రోడ్డు కం రైల్ బ్రిడ్జిపై రాకపోకల పునరుద్ధరణ

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

రోడ్డు కమ్ రైల్ బ్రిడ్జిపై ఆదివారం సాయంత్రం నుంచి వాహనాల రాకపోకలను పునరుద్ధరించామని ఆర్ అండ్ బి సూపరింటెండెంట్ ఇంజినీర్ ఎస్‌బివి.రెడ్డి తెలిపారు. హ్యాండ్ రెయిలింగ్, ఫుట్ పాత్‌ల మరమ్మతుల నిమిత్తం ఒక్కరోజు రాకపోకలు నిలుపుదల చేశారు. మరమ్మతుల అనంతరం రాకపోకలను పునరుద్ధరించామని తెలిపారు.

మున్సిపల్ సర్వీస్ రూల్స్‌లో లోపాలు సవరించాలి

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

మున్సిపల్ టీచర్స్‌కు సంబంధించి సర్వీస్ రూల్స్‌లో లోపాలను సవరించాలని యుటిఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. యుటిఎఫ్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి మున్సిపల్ టీచర్స్ సబ్ కమిటీ సమావేశం యుటిఎఫ్ హోమ్‌లో జిల్లా ప్రధాన కార్యదర్శి షరీఫ్ ఆధ్వర్యంలో జరిగింది. ఆయన మాట్లాడుతూ పురపాలక ఉపాధ్యాయులకు జిల్లా యూనిట్‌గా బదిలీలు, ఉద్యోగోన్నతలు చేపట్టేందుకు సర్వీసు నిబంధనల ముసాయిదాను వెబ్‌సైట్‌లో పెట్టారన్నారు. దీనిపై అభ్యంతరాలను ఆహ్వానించారన్నారు. ఇప్పటివరకూ విశాఖపట్నం, విజయవాడ నగరపాలక సంస్థలకు వేర్వేరుగా.. ఆయా జిల్లాల్లో నగరపాలక సంస్థలు, పురపాలక సంఘాలకు విడివిడిగా బదిలీలు నిర్వహిస్తున్నారన్నారు. ఈ నేపథ్యంలో జిల్లా యూనిట్‌గా చేసేందుకు ముసాయిదా తీసుకొచ్చారని తెలిపారు. ఇది కొత్త జిల్లాల ప్రకారం ఉంటుందా, పాత జిల్లా జిల్లాల ప్రకారం ఉంటుందా అనేదానిపై స్పష్టత ఇవ్వలేదన్నారు. కన్వీనర్ జెవివి.సుబ్బారావు మాట్లాడుతూ కొత్త నిబంధనను పురపాలక ఉపాధ్యాయులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారన్నారు. దీని వల్ల సర్వీసు కోల్పోతామని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా కార్యదర్శి ఎన్. రవిబాబు మాట్లాడుతూ జిల్లా యూనిట్ నిబంధనల అమలు కంటే ముందే బదిలీలు, ఉద్యోన్నతులు చేపట్టాలని కోరారు. మున్సిపల్ ఉపాధ్యాయులకు వెంటనే బదిలీలు, ఉద్యోగోన్నతలు నిర్వహించాలన్నారు. అర్బన్ ఎంఇఒ, అర్బన్ డివైఇఒ క్యాడర్‌లు సర్వీస్ రూల్స్‌లో పొందుపరచాలన్నారు. మున్సిపల్ ఉపాధ్యాయులకు పిఎఫ్ సౌకర్యం వెంటనే కల్పించాలని, జిల్లా పరిషత్‌లో మాదిరిగా ఎంఎ తెలుగు అర్హత ఉన్న ఎస్‌జిటిలకు స్కూల్ అసిస్టెంట్‌గా ఉద్యోగోన్నతులు కల్పించాలని డిమాండ్ చేశారు. ఎస్‌జిటి అర్హతల్లో డిఇడితో పాటు, బిఇడి చేసిన ఉపాధ్యాయులకు నిబంధనలు, సెలవు గ్రాంట్ చేసే అధికారాలు సమగ్రంగా రూపొందించాలన్నారు. జిల్లా పరిషత్ ఉపాధ్యాయులకు అందుతున్న అనేక ఇతర సౌకర్యాలు మున్సిపల్ ఉపాధ్యాయులకూ అందేలా సర్వీస్ రూల్స్‌లో మార్పు చేయాలని సమావేశం డిమాండ్ చేసింది.

సమావేశంలో మాట్లాడుతున్న షరీఫ్

నాగేశ్వరరావుకు మాజీ ఎంఎల్‌ఎ పరామర్శ

ప్రజాశక్తి-తాళ్లపూడి

సతీ వియోగంతో బాధడపుతున్న సిటీ కేబుల్ నాగేశ్వరరావును కొవ్వూరు మాజీ ఎంఎల్‌ఎ టివి.రామారావు ఆదివారం పరామర్శించారు. కుటుంబానికి సానుభూతిని వ్యక్తం చేశారు. ఆయన వెంట జనసేన మండల అధ్యక్షుడు గంట కృష్ణ, తాళ్లపూడి గ్రామ శాఖ అధ్యక్షులు ఎ.మణికంఠ నియోజక వర్గానికి చెందిన పలువురు నాయకులు ఉన్నారు.

సాయం అందిస్తున్న పూర్వ విద్యార్థులు

అక్షయ్ రామ్‌కి ఆర్థిక సాయం

ప్రజాశక్తి- గోకవరం

గోకవరం జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1996, 2001 సంవత్సరాల్లో పదోతరగతి విద్యార్థులు కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న అక్షయ్ రామ్‌కి రూ.40,700 ఆర్థిక సాయం అందించారు. ఈ మొత్తాన్ని విద్యార్థి బంధువు పొట్నూరి సత్తిబాబుకు పిఎంసి చైర్మన్ కణితి శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఫ్రెండ్స్ హెల్పింగ్ యూత్ ద్వారా ఆదివారం అందించారు. ఈ కార్యక్రమంలో ముమ్మిడివరపు భాస్కర్, అంగిల సాంబ, కంది సూరిబాబు, నెల్లిపూడి జగదీష్, బత్తుల సతీష్, మల్లువలస కృష్ణ, జి.బాబి పాల్గొన్నారు.

కార్టూ'నిజం'



ఘనంగా అచ్చెన్నాయుడు పుట్టినరోజు

ప్రజాశక్తి - తాళ్లపూడి, నిడదవోలు, సీతానగరం

టిడిపి రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ మంత్రి కె.అచ్చెన్నాయుడు పుట్టిన రోజును తాళ్లపూడిలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఆ పార్టీ మండల అధ్యక్షుడు నామన పరమేశ్వరరావు కేక్ కట్ చేసి శుభాకాంక్షలు పంపించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు మద్దిపాటి ప్రకాశం, చిట్టిబాబు, కొటారు వెంకట్రావు, కాకర్ల వంశీ, కైగాల శ్రీను, గుండుబోగుల ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. అన్నదేవరపేట గ్రామంలో జరిగిన కార్యక్రమంలో పలువురు నాయకులు మాట్లాడుతూ బిసిలకు రాష్ట్రంలో గుర్తింపు వచ్చింది టిడిపి పాలనలోనే అన్నారు. ఈ కార్యక్రమంలో కాకర్ల సత్యేంద్ర, కె.గణేష్, టి.భరత్ ఎల్.ఆదిత్య తదితరులు ఉన్నారు. నిడదవోలు మండలం పెండ్యాలలో కుందుల శిబిరలో టిడిపి శ్రేణులు కేక్ కట్ చేసి అచ్చెన్నాయుడు పుట్టినరోజును నిర్వహించారు. తెలుగు యువత మాజీ అధ్యక్షులు ఎస్‌కె.బాబు, పెరవలి మండల టిడిపి నాయకులు అనపర్తి జయ, సమిశ్ర గూడెం టిడిపి గ్రామ అధ్యక్షుడు మద్దుకూరి శ్రీనివాస్, గుడ్ల బుజ్జి, సుంకవల్లి శ్రీధర్, కె.లీలాకుమార్, కుందుల రమేష్ తదితరులు పాల్గొన్నారు. నియోజకవర్గ టిడిపి నాయకులు కుందుల వీరవెంకటసత్యనారాయణ హైదరాబాద్‌లో ఉన్న అచ్చెన్నాయుడుని కలిసి బుకే ఇచ్చి పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు. సీతానగరం బాలాజీ సెంటర్‌లో మాజీ ఎంఎల్‌ఎ పెందుర్తి వెంకటేష్ ఆధ్వర్యంలో అచ్చెన్నాయుడు పుట్టిన రోజును ఘనంగా నిర్వహించారు. బాలాజీ సెంటర్‌లో ఎన్‌టిఆర్ విగ్రహం వద్ద కేక్ కట్ చేసి పంచారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు గద్దే సురేష్, చిట్టూరి రంగారావు, వలవల రాజా, తెలుగుయువత నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

తాళ్లపూడిలో అచ్చెన్నాయుడి పుట్టినరోజు సందర్భంగ్ కేక్ కట్ చేస్తున్న నాయకులు

ధవళేశ్వరంలో చందన పర్యటన

ప్రజాశక్తి - ధవళేశ్వరం

ధవళేశ్వరంలో వైసిపి రూరల్ కో-ఆర్డినేటర్ చందన నాగేశ్వర్ ఆదివారం పర్యటించారు. ఎర్రకొండ ప్రాంతంలో డ్రెయినేజీ సమస్యను పరిశీలించారు. తక్షణమే సంబంధిత అధికారులతో మాట్లాడారు. ఇటీవల అనారోగ్యానికి గురయ్యి చికిత్స పొందుతున్న గోలి దేవాను ఆయన స్వగహంలో పరామర్శించారు. తగు జాగ్రత్తలు తీసుకుని త్వరలో పార్టీకి సేవలు అందించాలని చందన ఆకాక్షించారు. ఈ కార్యక్రమంలో వక్ఫ్ బోర్డ్ డైరెక్టర్ షట్టర్ బాషా, సచివాలయం కన్వీనర్లు సాధనాల శివ, తలారి ప్రసాద్, డాక్టర్ సత్యగిరి, బొడ్డేటి శివాజీ, రేగుల్ల రాజు, గూటం రాజు, కుమార్, బాలరాజు, కామేశ్వరరావు, కల్యాణిరెడ్డి, లక్ష్మి, నంబూరి రవి, ముత్యాల అనంతబాబు పాల్గొన్నారు.

దేవాను పరామర్శిస్తున్న చందన నాగేశ్వర్

నేరాలు ఘోరాలు

ఆటో బోల్తా నలుగురికి గాయాలు

ప్రజాశక్తి - సీతానగరం

ఆదివారం సింగవరం సచివాలయం సమీపంలో ఆటో బోల్తా పడి నలుగురికి గాయాలయ్యాయి. వివరాలు ఇలా ఉన్నాయి. నిడదవోలు గ్రామానికి చెందిన పలువురు దేవీపట్నం మండలం గండిపోచమ్మ ఉత్సవాలకు వెళ్ళారు. ఆదివారం తిరిగి వస్తుండగా సింగవరం సచివాలయం సమీపంలో ఎటుగట్టు మీద నుండి ఆటో అదుపుతప్పి నిమ్మతోటలో బోల్తా పడింది. ఈ ప్రమాదంలో నలుగురికి గాయాలయ్యాయి. స్థానికులు వైద్యం నిమిత్తం క్షతగాత్రులను హుటాహుటిన జనసేన అంబులెన్స్‌లో రాజమండ్రి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

ఐదుగురిపై ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ కేసు

ప్రజాశక్తి- కరప

దాడి కేసులో ఐదుగురిపై ఎస్‌సి, ఎస్‌టి అత్యాచార నిరోధక చట్టం కేసులు నమోదు చేసినట్లు ఎస్‌ఐ నౌడు రామకష్ణ తెలిపారు. కరప నక్కవారిపేటలో అంబేద్కర్ విగ్రహం వద్ద ఇటీవల జరిగిన దాడి ఘటనలో కరప గ్రామానికి చెందిన కొప్పాడ మణికంఠ, కొప్పాడ వెంకటకష్ణ, అంగాడి దుర్గాప్రసాద్, వనమాడి సురేష్, కొప్పాడ వీరమణిపై కులం పేరుతో దూషించారని, గాయపరిచారని అదే గ్రామానికి చెందిన గొల్ల రవి, కనికెళ్ల అశోక్ పోలీస్ స్టేషన్ నందు ఫిర్యాదు చేశారు. ఈ కేసుపై సమగ్రంగా విచారణ జరిపి అట్రాసిటీ కేసును నమోదు చేసినట్లు ఎస్‌ఐ రామకష్ణ తెలిపారు. ఈ కేసులో సాక్షులను విచారించేందుకు ఆదివారం డిఎస్‌పి కరప గ్రామంలో బాధితుల ఇంటికి వెళ్లారని చెప్పారు.

బైకు అదుపు తప్పడంతో గోదావరిలో పడి యువకుడు మృతి

ప్రజాశక్తి - రామచంద్రపురం

బైకుపై వేగంగా వెళుతూ ప్రమాదభరితంగా ఉన్న రోడ్డు మలుపులో గోదావరిలో పడి యువకుడు మృతి చెందిన సంఘటన కె.గంగవరం మండలం రాజువేరి గ్రామం వద్ద చోటుచేసుకుంది. దీనికి సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం రాజమండ్రి వద్ద లాలాచెరువు సమీప ప్రాంతమైన బాబానగర్‌కు చెందిన యువకుడు యర్ర ప్రదీప్ కుమార్ (30) యానం వైపు నుండి వస్తూ రాజువేరు గ్రామంవద్ద ఎస్ ఆకారంలో ఉండే మలుపు గమనించకుండా ఇక్కడ గల వంతెన పైనుండి గోదావరిలో పడిపోయాడు. పరిసర ప్రాంత ప్రజలు గమనించి ఇతనిని పైకి తీసేలోపు మృతి చెందినట్లు పోలీసులు వివరించారు. మతదేహాన్ని రామచంద్రాపురం ఏరియా ఆసుపత్రికి పోలీసులు తరలించారు.

అనుమానాస్పద స్థితిలో మహిళ మృతి

ప్రజాశక్తి-అమలాపురం రూరల్

అమలాపురం రూరల్ మండలం బండారులంక కందులపాడు కాలనీకి చెందిన వివాహిత దంగేటి దివ్య (32) ఆదివారం ఈదరపల్లి కాలువలో పడి అనుమానాస్పదంగా మృతి చెందింది. శనివారం ఆమె అదృశ్యమైనట్లు ఆమె భర్త పార్థసారథి అమలాపురం తాలూకా పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ పరదేశి తెలిపారు.

పేకాట శిబిరంపై దాడి

ప్రజాశక్తి - ఆత్రేయపురం

మండలంలోని వెలిచేరు గ్రామ శివారులో ఆదివారం పేకాట శిబిరంపై ఎస్‌ఐ సిహెచ్.సుధాకర్ తన సిబ్బందితో దాడి చేసి ఆరుగురిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ.4 వేల స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

రాత్రి సమయంలో ఫ్లైఓవర్ వద్ద చీకట

విద్యుత్ లైట్లు పునరుద్ధరించరూ..

ప్రజాశక్తి-నల్లజర్ల

పుల్లలపాడు నుంచి దూబచర్ల వైపు 16వ నెంబరు జాతీయ రహదారిపై, ఉన్న మొదటి ఫ్లై ఓవర్ వద్ద గత నెల రోజుల నుండి విద్యుత్ లైట్లు వెలగడం లేదని వాహన చోదకులు, ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తక్షణమే విద్యుత్తులైట్లను బాగు చేయించాలని వేడుకుంటున్నారు.

పుల్లలపాడు వైపు నుండి దూబచర్ల మీదగా అనేకమంది భక్తులు పాదయాత్రగా ద్వారకాతిరుమల చిన్న వెంకన్న దర్శనం కోసం నిత్యం వెళుతూ ఉంటారు రాత్రి సమయంలో ఈ ఫ్లైఓవర్ వద్ద చీకటిగా ఉన్నందున అనేకమంది మద్యం సేవించి ఉంటారు. వీరితో పాదయాత్రగా వెళ్తున్న భక్తులకు ఇబ్బందికరంగా ఉంటుంది. చీకటిలో ఎవరు ఎలాంటి అఘాయిత్యానికి పాల్పడతారో అని. ప్రజలు ప్రాణాలు గుప్పెట్లో పెట్టుకుని, యాత్రను కొనసాగిస్తున్నారు. అంతేకాకుండా ప్రతి మంగళవారం ఆదివారం చేపల విక్రయదారులు వాహనాలను వేకువ జామున ఆ ప్రాంతంలో నిలిపి విక్రయాలు చేస్తూ ఉంటారు. పుల్లలపాడు, ముష్యులకుంట గ్రామస్తులు ఆ దారి గుండా వెళ్లడానికి ఇబ్బంది పడుతున్నారు. ఉదయం నాలుగు గంటల నుంచి 5 గంటల మధ్య అనేకమంది యువకులు ఇదే ఫ్లైఓవర్ వద్ద తమ బైకులను ఉంచి దూబచర్ల వైపు వ్యాయామం నిమిత్తం (వాకింగ్) నడుస్తూ ఉంటారు. చీకటిలో వాహనాలు ఉంచడం వల్ల తిరిగి వచ్చేసరికి అవి ఉంటాయో లేదో అని, భయపడుతున్నామని కొందరు వాపోయారు. తక్షణమే సంబంధిత శాఖ వారు స్పందించి ఆ ప్రాంతంలో ఉన్న విద్యుత్ లైట్లు పునరుద్ధరించాలని ప్రజలు కోరుతున్నారు.

మంచినీటి కాలువ ఆధునికీకరణేదీ..

మురికినీటి కాలవను తలపిస్తున్న వైనం
శిథిలమై పలుచోట్ల కూలిపోయిన కాలవ గోడలు

ప్రజాశక్తి -యానాం

యానాం భీమ్ నగర్ నుంచి నల్లచెరువు వద్ద గల తూము వరకూ ఉన్న మంచినీటి కాలువు సంవత్సరాలు గడుస్తున్నా ఆధునీకరణకు మాత్రం నోచుకోవడం లేదు. మంచినీటికాలవ పరిస్థితి కాస్తా మురికినీటి కాలవగా మారినా అధికారుల్లో చలనం రావడం లేదు. మంచినీటి చెరువులకు నీరు వెళ్లే కాలవపట్ల అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో నల్లరాళ్లతో కట్టిన కాలవ గోడ ప్రస్తుతం పూర్తిగా శిథిలస్థితికి చేరింది. పలుచోట్ల గోడలు కొంతమేర కూలిపోగా కొన్ని చోట్ల భారీగా బీటలు తీసింది. అయితే గతేడాది యూకేవినగర్ దగ్గర కాలవగోడ కొంతమేర కూలిపోగా అక్కడ కాంక్రీటు గోడ నిర్మించారు. కాలవగోడ మొత్తం శిథిలమైతే పూర్తి స్థాయిలో ఆధునీకరించకుండా ముక్కలు ముక్కలుగా నిర్మించడమేంటని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ప్రజా పనుల శాఖ అధికారులు చెరువులకు నీరుపట్టే సమయంలో మొక్కుబడిగా పూడికలు తీయించడం తప్ప కాలవ నిర్వహన పట్ల శ్రద్ధ లేదన్న సంగతి కాలవను చూస్తే అర్థమవుతుంది. కాలవ దుస్థితిని ఏమాత్రం పట్టించుకోవడం లేదని స్థానికులు విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా కాలవను పూర్తిస్థాయిలో ఆధునీకరించాలని,లేకపోతే పైప్ లైన్ వేయాలని ప్రజలు కోరుతున్నారు.

మంచినీటి కాలవలో కలుస్తున్న మురుగు

మంచినీటి కాలువ పక్కనే మురికినీటి డ్రైన్

మంచినీటి కాలవ ప్రక్కనే మురికినీటి కాలువ

ఈ మంచినీటి కాలవకు ఆనుకొని పైవాలున మురికినీటి డ్రైన్ నిర్మించిన ఘనత స్థానిక ప్రజాపనులశాఖ అధికారులకే దక్కుతుంది. భీమ్ నగర్ నుంచి యూకెవి నగర్ రోడ్ వరకూ కాలువ వెంబడి పైవాలున మురికినీటి డ్రైన్ నిర్మించారు. అయితే అప్పుడప్పుడు మురికి నీటి కాలవ పొర్లిపోయి ఆ నీరంతా మంచినీటి కాలవలో కలుస్తోంది. వర్షకాలంలో అయితే యూకేవి నగర్ నుంచి వచ్చే మురికినీరంతా మంచినీటి కాలువలోనే కలుస్తుంది. మురికినీటి కాలవను మూసివేసి మంచినీటి కాలవకు దూరంగా నిర్మించాలని ఎప్పటినుంచో ప్రజలు కోరుతున్నా పట్టించుకునే నాథుడే లేడు. ప్రజలకు పరిశుభ్రమైన నీరు అందించాల్సిన అధికారులకు మంచి కాలవను పట్టించుకునే తీరిక లేకపోయింది. కాలవతూము వద్ద నివాసం ఉంటున్న కొంతమంది కాలవలోనే నిత్యం దుస్తులు ఉతకడం, తదితర పనులు చేస్తున్నా ఇదేమిటని అడిగే పరిస్థితి లేదంటే..ఇది నిర్లక్ష్యానికి పరాకాష్ట అని చెప్పవచ్చు.మంచినీరు కలుషితం కాకుండా పైప్ లైన్ నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు.

యానాం వార్తలు

బహుమతులు ప్రదానం చేస్తున్న ఆర్‌ఎఐ మునిస్వామి

పశువులు, కోళ్లు, పక్షుల ప్రదర్శన

ప్రజాశక్తి-యానాం

పశువులను సంరక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని ఆర్‌ఎఐ మునిస్వామి పేర్కొన్నారు. ఆదివారం పుదుచ్చేరి పశు గణాభివద్ధి, పశుసంక్షేమశాఖ ఆధ్వర్యంలో స్థానిక వెటర్నరీ ఆసుపత్రి ఆవరణలో పశువులు, కోళ్లు, పక్షులు, పెంపుడు కుక్కల ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా విజేతలకు బహుమతుల ప్రధానోత్సవ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఆవులు, గేదెలు, మేకలు తదితర వాటిని అభివద్ధి చేయాల్సిన ఆవశ్యకత ఉందని వాటి పెంపకం ద్వారా పలు కుటుంబాలు ఆర్థికాభివద్ధి సాధించడానికి అవకాశం ఉంటుందన్నారు. వివిధ గ్రామాలనుంచి పశువులను తీసుకురావడంతో వెటర్నరీ ఆసుపత్రి అంతా సందడి నెలకొంది. ఆవుల విభాగంలో ప్రథమ బహుమతి కూరాకుల సత్తిబాబు, ద్వితీయ బహుమతి చంపటి కష్ణంరాజు, తతీయ బహుమతి వంటెద్దు వాసుకు లభించగా, గేదెల విభాగంలో వంటెద్దు జగదీశ్వరి, ద్వితీయ బహుమతి కోనామి లక్ష్మీనారాయణ, తతీయ బహుమతి కూరాకుల వంశీకి లభించింది. ఈ కార్యక్రమంలో వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ డాక్టర్ మెల్ల వెంకటరమణ, డాక్టర్ చెక్కపల్లి శ్రీరామ్, విఎఎస్ డాక్టర్ కె ఆంధ్రు జాబకుమార్, సిబ్బంది పండు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఒంటిపూట బడులు

ప్రజాశక్తి - యానాం

నియోజకవర్గంలో నేటి నుంచి ఒంటిపూట బడులు ప్రారంభిస్తున్నట్లు ఆర్‌ఎఐ మునిస్వామి ప్రకటనలో పేర్కొన్నారు. ఈ మేరకు ప్రతి రోజూ ప్రభుత్వ, ప్రైవేట్, ఎయిడెడ్, పాఠశాలలు ఉదయం 7:45 నుంచి మధ్యాహ్నం 12:30 గంటల వరకు జరగనున్నాయని తెలిపారు.

అగ్ని ప్రమాదంలో 4 ఇళ్లు దగ్ధం

ప్రజాశక్తి - అమలాపురం రూరల్

అమలాపురం రూరల్ మండలం బండారులంక గ్రామంలోని 4 చేనేత కార్మికుల ఇళ్లు ఆదివారం జరిగిన అగ్ని ప్రమాదానికి ఆహుతయ్యాయి. ఈ సంఘటనలో 7 కుటుంబాల సభ్యులు నిరాశ్రయులయ్యారు. స్థానిక గ్రామ సర్పంచ్ పెనుమాల సునీత ఏడుకొండలు హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకుని బాధితులను సురక్షిత ప్రాంతాలకు తరలించారు. వంట గ్యాస్ లీక్ అవడంతో మంటలు చెలరేగి ఒక్కసారిగా సిలిండర్ పేలడంతో ఈ పెను ప్రమాదం సంభవించిందని బాధితులు తెలిపారు. ఘటనా స్థలానికి చేరుకున్న ఫైర్ సిబ్బంది మంటలను అదుపు చేశారు. ఎంపిపి కుడుపూడి భాగ్యలక్ష్మి, జెడ్‌పిటిసి పందిరి శ్రీహరి రామ్ గోపాల్ బాధిత కుటుంబాలను పరామర్శించారు. బాధితులకు తక్షణ సాయంగా అమలాపురం మండల రెవెన్యూ అధికారులు ఒక్కొక్క కుటుంబానికి 20 కేజీల చొప్పున బియ్యాన్ని అందజేశారు. వారి వెంట వార్డు మెంబర్ గుత్తుల సత్తిబాబు తదితరులు ఉన్నారు.

అగ్ని ప్రమాదంలో పూర్తిగా కాలిన ఇల్లు

గౌరవ వందనం సమర్పిస్తున్న పోలీసులు

ప్రభుత్వ లాంఛనాలతో జవాన్ అంత్యక్రియలు

ప్రజాశక్తి - ఆత్రేయపురం

మర్లపాలెం గ్రామానికి చెందిన సిఆర్‌పిఎఫ్ జవాన్ పల్లి ఇజ్రాయిల్ చికిత్స పొందుతూ శనివారం హైదరాబాద్ కేర్ ఆసుపత్రిలో మృతి చెందాడు. జవాన్ మృతదేహాన్ని సిఆర్పిఎఫ్ 42వ బెటాలియన్ కమాండెంట్ డిఎస్‌పి ఎం.రాధా ఆదివారం కుటుంబ సభ్యులకు అప్పగించారు. ప్రభుత్వ పరంగా తక్షణ సాయంగా రూ.50 వేల ఆర్థిక సాయాన్ని అందించారు. అనంతరం ర్యాలి శ్మశాన వాటికలో ప్రభుత్వ లాంచనాలతో మిలటరీ సిబ్బంది స్థానిక పోలీసులు అంత్యక్రియలు నిర్వహించారు. జవాన్ కుటుంబ సభ్యులను గ్రామ సర్పచ్ మెర్ల రాము తదితరులు పరామర్శించారు.



సర్టిఫికెట్ అందజేస్తున్న దృశ్యం

రామ్‌చరణ్ అభిమానుల రక్తదానం

ప్రజాశక్తి - అమలాపురం

సినీనటుడు రామ్ చరణ్ తేజ్ పుట్టినరోజు వేడుకలు సందర్భం గా వివిధ సేవ సేవా కార్యక్రమంలో భాగంగా ఆదివారం మెగా రక్త దాన శిబిరం నిర్వహించారు. అంబాజీపేట మండల రామ్ చరణ్ ఫ్యాన్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ భూషణ్ నాయుడు ఆధ్వర్యంలో అమలాపురం బుద్దాల బ్లడ్ బ్యాంక్ ఆదివారం బ్లడ్ డొనేషన్ క్యాంప్ ఏర్పాటు చేశారు. రక్త దాతల సంఖ్య తగ్గిన ఈ సమయంలో రక్త దాన శిబిరాలు ఏర్పాటు చేసి ఎందరో ప్రాణాలను కాపాడుతున్న రామ్ చరణ్ ఫ్యాన్స్ రక్తం దానం చేసిన ప్రతీ ఒక్కరికీ బుద్దాల బ్లడ్ బ్యాంక్ వారు కతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

నూకాంబిక ఆలయానికి యాత్రికుల తాకిడి

ప్రజాశక్తి - ఆలమూరు

చింతలూరు నూకాంబిక అమ్మవారి జాతర, తీర్థ ఉత్సవాల్లో భాగంగా ఆదివారం యాత్రికులు పోటెత్తారు. ఉదయం నుండి అమ్మవారికి మొక్కులు తీర్చుకునేందుకు ఉభయ తెలుగు రాష్ట్రాల నుండి వేలాదిమంది యాత్రికులు తరలివచ్చారు. రావులపాలెం సిఐ రజిని కుమార్, ఎస్‌ఐ ఎస్ శివప్రసాదులు భారీ బందోబస్తు నిర్వహించారు యాత్రికులకు అసౌకర్యం కలుగకుండా ఆలయ కార్యనిర్వాహక కార్యదర్శి ఉండవల్లి వీర్రాజు చౌదరి, ధర్మకర్తల మండలి ఛైర్మన్ నూకపెయ్యి సూరిబాబు, జూనియర్ అసిస్టెంట్ భాస్కర్ శ్రీనివాస్, తదితరులు పర్యవేక్షించారు.

ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు

కార్మిక హక్కులను కాలరాస్తున్న ప్రభుత్వాలు

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక హక్కులను కాలరాస్తున్నాయని ఐఎఫ్‌టియు నాయకులు అన్నారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ఐఎఫ్‌టియు 7వ మహాసభ ఆదివారం రాజమహేంద్రవరంలో జరిగింది. తొలుత కోటిపల్లి బస్టాండ్ నుంచి మెయిన్ రోడ్డు మీదుగా సభాప్రాంగణమైన గోదారి గట్టున శ్రీశివ వీరభద్ర రజక కళ్యాణ మండపం వరకు కార్మికులతో ర్యాలీ సాగింది. ప్రదర్శన అనంతరం కళ్యాణ మండపం వద్ద ఐఎఫ్‌టియు జిల్లా అధ్యక్షులు ఎవి.రమణ పతాకావిష్కరణ చేశారు. అనంతరం రమణ అధ్యక్షతన మహాసభ ప్రారంభమైంది. ఈ సభలో పౌర హక్కుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు నంబూరు శ్రీమన్నారాయణ ప్రారంభోపన్యాసం చేశారు. కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం ప్రజల సమస్యలను పక్కదారి పట్టిస్తుందన్నారు. మతం, కులం, ప్రాంతం, భాష పేరుతో ప్రజల మధ్య విద్వేషాలు సృష్టిస్తుందన్నారు. నిరుద్యోగాన్ని, పేదరికం, అసమానతలను పెంచి పోషిస్తుందని విమర్శించారు. అంబానీ, ఆదానీలకు దేశసంపదను అప్పనంగా దోచిపెడుతుందన్నారు. ఈ విధానాలకు వ్యతిరేకంగా అందరకూ ఐక్యంగా పోరాడాలన్నారు. అనంతరం సిపిఐఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి ఎం దుర్గాప్రసాద్, ఇఫ్టూ రాష్ట్ర ఉపాధ్యక్షులు జె.వెంకటేశ్వరరావు మాట్లాడారు. నల్ల చట్టాలకు వ్యతిరేకంగా పోరాడి విజయం సాధించిన రైతాంగ పోరాట స్ఫూర్తితో కార్మిక వర్గం సమస్యలపై పోరాడాలని పిలుపునిచ్చారు. ఈ మహాసభలో ఎఐకెఎంఎస్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు జె.సత్తిబాబు, పి.వెంకట నాయుడు, సౌత్ సెంట్రల్ రైల్వే ఎంప్లాయిస్ సంఘ్ రాజమండ్రి అధ్యక్షులు టి.నాగేంద్ర పాల్గొన్నారు.

'అల్లుకున్న' నిర్లక్ష్యం

ప్రజాశక్తి -మండపేట

స్థానిక బైపాస్ రోడ్డులోని ఐస్ ఫ్యాక్టరీ ఎదురుగా ఉన్న విద్యుత్ స్తంభానికి పాదులు నిండుగా అల్లుకున్నాయి. విద్యుత్ వైర్లకు పాదుల తీగలకు తాకితే వాటి ద్వారా విద్యుత్ ప్రవాహంతో విద్యుత్ ప్రమాదాలు చోటుచేసుకునే అవకాశాలు ఉన్నాయని పలువురు చెబుతున్నారు. అలుముకున్న పాదుల తీగలు తొలగించాలని పలువురు కోరుతున్నారు. అంతేకాకుండా చెట్ల కొమ్మలు విద్యుత్ వైర్లలోకి వెళ తున్నాయని ట్రీ కటింగ్ చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

అల్లుకున్న పాదులు

టిడిపి ఆఫర్‌ను తిరస్కరించా : ఎంఎల్‌ఎ రాపాక

ప్రజాశక్తి-అమలాపురం

ఎంఎల్‌సి కోటాలో ఎంఎల్‌సి ఎన్నికల్లో టిడిపి అభ్యర్థికి ఓటు వేస్తే రూ.పది కోట్లు ఆఫర్ చేశారని వైరల్ అవుతున్న వార్తపై రాపాక ఆదివారం స్పందించారు. ఆదివారం రాజోలులో ఒక కార్యక్రమంలో పాల్గొన్న రాపాక మాట్లాడుతూ తను చేసిన వ్యాఖ్యలకు వివరణ ఇచ్చారు. శనివారం అంతర్వేదిలో వైసిపి కార్యకర్తలు ఏర్పాటుచేసిన ఆత్మీయ సమ్మేళనంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్నానని అన్నారు. ఈ సందర్భంగా ఈ వ్యాఖ్యలు చేశానని ఆయన అన్నారు. ఆ సందర్భంలో మాట్లాడుతూ రాజకీయ నాయకులు ఏ పార్టీలో ఉన్నా నీతి నిజాయితీతో పని చేయాలని, అక్రమాలకు పాల్పడకూడదని అన్నానని పేర్కొన్నారు. తన ఓటు అమ్ముకుంటే రూ. 10 కోట్లకు పైగా వచ్చేవని అన్నాను గాని, రూ. 10 కోట్లు ఇస్తానని ఎవరూ అనలేదని అన్నారు. ఎంఎల్‌సి ఓటింగ్ సందర్భంలో ఉండి ఎంఎల్‌ఏ రామరాజు టిడిపి మద్దతు పలకాలని మీ భవిష్యత్తు బాగుంటుంది ఆర్థికంగా కూడా ఆదుకుంటామని అన్నారని రాపాక తెలిపారు. వెంటనే ఎంఎల్‌ఏ రామరాజు ఆఫర్ ను తిరస్కరించానని క్రాస్ ఓటింగ్ వేయనని కచ్చితంగా చెప్పానని రాపాక వరప్రసాద్ అన్నారు. ముందుగా టిడిపి వారు తన మిత్రుడు రాజోలు నియోజకవర్గం వైసిపి నాయకులు కెఎస్‌ఎన్.రాజు ను సంప్రదించారని, అయితే మా ఎంఎల్‌ఏ డబ్బులు తీసుకుని ఓటు వేసే వ్యక్తి కాదని కెఎస్‌ఎన్.రాజు తో చెప్పినట్లు రాపాక తెలిపారు .తన దగ్గర రూ.కోట్ల డబ్బు లేదన్నారు. డబ్బుకి లొంగకుండా ఆత్మ ప్రమోదానుసారం తన ఓటు హక్కు వినియోగించుకున్నారని రాపాక అన్నారు. సిఎం జగన్ ఆదేశాలు పాటిస్తానని రాపాక తెలిపారు.

మాట్లాడుతున్న ఎంఎల్‌ఎ రాపాక

సమాజాభివృద్ధిలో ఉపాధ్యాయులదే కీలక పాత్ర

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

సమాజంలో ఉపా ధ్యాయ వృత్తి చాలా గౌరవ ప్రదమైనదని, సమాజాభివృద్ధిలో కూడా గురువులే కీలకమనిఎంపీ మార్గాని భరత్‌రామ్ అన్నారు. అంతటి సమర్థులు చట్ట సభల్లో దిశా నిర్దేశం చేసి ఈ రాష్ట్ర సర్వతో ముఖాభివృద్ధిలో అగ్రస్థానంలో ఉండాలని నూతనంగా ఎన్నికైన ఉపాధ్యాయ ఎంఎల్‌సి సభ్యులను ఎంపీ కోరారు. ఆదివారం రాజమండ్రి రూరల్ కాతేరు వెంకటాద్రి కల్యాణ మండపంలో 'ఆంధ్రప్రదేశ్ ప్రైవేటు అన్ ఎయిడెడ్ స్కూల్స్ మేనేజ్‌మెంట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయ ఎంఎల్‌సిలుగా ఎన్నికైన వారికి అభినందన సభ నిర్వహించారు. కష్ణా, గుంటూరు జిల్లాల ఉపాధ్యాయ ఎంఎల్‌సి టి.కల్పలతారెడ్డి, పశ్చిమ రాయలసీమ ఉపాధ్యాయ ఎంఎల్‌సి ఎంవి.రామచంద్రారెడ్డి, తూర్పు రాయలసీమ ఉపాధ్యాయ ఎంఎల్‌సి పి.చంద్రశేఖర్‌రెడ్డిలను ఎంపీ భరత్, హోం మంత్రి తానేటి వనిత, వైసిపి జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా, రాష్ట్ర మహిళా శిశు సంక్షేమ శాఖ ఛైర్మన్ వాసిరెడ్డి పద్మ సత్కరించారు. ఈ సందర్భంగా ఎంపీ భరత్ మాట్లాడారు. ఇటీవల జరిగిన ఎంఎల్‌సి ఎన్నికల్లో మెజార్టీ స్థానాల్లో వైసిపి అభ్యర్థులను గెలిపించి జగన్ పాలనపై సంపూర్ణ మద్దతును ప్రకటించారని, ఇదే విధంగా 2024 ఎన్నికల్లోనూ జగన్ కే పట్టం కట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైసిపి నగర అధ్యక్షుడు అడపా శ్రీహరి, ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలోని వివిధ విద్యా సంస్థల ప్రతినిధులు, నిర్వాహకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

ఆర్యాపురం కో-ఆపరేటివ్ బ్యాంకు అభివృద్ధికి కృషి

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

నగరంలోని ది ఆర్యాపురం కోఆపరేటివ్ అర్బన్ బ్యాంకు శతాబ్ద కాలం చరిత్ర కలిగిందని, రాష్ట్రంలోనే అతి పెద్ద కో-ఆపరేటివ్ బ్యాంకుగా ఉందని, దీన్ని మరింత అభివృద్ధి పదంలో ముందుకు తీసుకెళ్లాలని ఎంపీ మార్గాని భరత్‌రామ్ పిలుపునిచ్చారు. బ్యాంకు ప్రధాన కార్యాలయంలో నూతనంగా ఏర్పాటు చేసిన వాటర్ ప్లాంట్‌ను ఆయన ఆదివారం ప్రారంభించారు. వాటర్ ప్లాంట్ విషయంలో పాలకవర్గం తీసుకున్న నిర్ణయాన్ని ఎంపీ అభినందించారు. అనంతరం బ్యాంకు కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడారు. ఈ కో-ఆపరేటివ్ బ్యాంకు 1919లో సరిపెల్ల విశ్వేశ్వర ప్రసాదరావు ఏర్పాటు చేశారన్నారు. వందేళ్లుగా ఖాతాదారుల అభిమానం, నమ్మకంతో నడుస్తోందన్నారు. ఏ సంస్థకైనా నమ్మకమే ప్రగతికి మెట్లు అనే విషయాన్ని పాలకవర్గం, సిబ్బంది మర్చిపోరాదన్నారు. వ్యవస్థాపకుల ఆశయాలకు మరింత శోభ తెచ్చే విధంగా ప్రస్తుత పాలకవర్గం కృషి చేస్తోందన్నారు. ఈ బ్యాంకు 16 బ్రాంచ్‌లతో 90 వేల సభ్యులతో నడుస్తోందన్నారు. రూ.700 కోట్లు డిపాజిట్లు, రుణాలు, అడ్వాన్స్‌లుగా రూ.380 కోట్లు ఇవ్వగా రూ.300 కోట్లు నిల్వలు ఉన్నాయన్నారు. గత సంవత్సరం బ్యాంకు ప్రాఫిట్ రూ.23 కోట్లయితే, 2023-24 ఆర్థిక సంవత్సరంలో రూ.27 కోట్లు లాభాలు గడించిందన్నారు. వచ్చే సంవత్సరానికి మరింత లాభాల బాటలో పయనించాలని ఆకాంక్షించారు. తొలుత బ్యాంకు ఆవరణలో గల ఆర్యాపురం కోఆపరేటివ్ అర్బన్ బ్యాంకు వ్యవస్థాపకుడు సరిపెల్ల విశ్వేశ్వర ప్రసాదరావు విగ్రహానికి ఎంపీ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు పాలకవర్గ ఛైర్మన్ గిరజాల రామకృష్ణతులసి, సభ్యులు మజ్జి నూకరత్నం, మార్గాని సురేష్, సక్కెళ్ల బాబూరావు, పెంకే సురేష్ కుమార్, పతివాడ రమేష్‌బాబు, రాయుడు గణేష్, వేణుం వెంకటేశ్వరరావు, గొల్లపాటి లీలా గంగాధరరావు, వెంట్రపాటి సురేష్, యర్రా ప్రసాదరావు, వైసిపి నగర అధ్యక్షుడు అడపా శ్రీహరి, వైసిపి నేత గిరజాల బాబు తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ భరత్ రామ్

టోల్ గేట్ సిబ్బందికి ఉద్యోగ భద్రత కల్పించాలి

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో టోల్‌గేట్లలో పనిచేస్తున్న సిబ్బందికి ఉద్యోగ భద్రత కల్పించాలని ఎఐటియుసి జిల్లా ఉపాధ్యక్షులు తాటిపాక మధు పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక ఎఐటియుసి కార్యాలయంలో ఎపి టోల్‌గేట్ యూనియన్ రాజమండ్రి శాఖ ఆధ్వర్యంలో కె.చినబాబు అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మధు మాట్లాడారు. చాలా టోల్‌గేట్లలో సిబ్బంది 2015 నుంచి పనిచేస్తున్నారన్నారు. అప్పటి నుంచి వీరికి కనీస వేతనం కూడా అమలు కావట్లేదన్నారు. సిబ్బందికి నెలకు రూ.10వేలు మాత్రమే వేతనం ఇస్తున్నారన్నారు. వీటితో వారు కుటుంబాలను ఎలా పోషించుకోవాలని ప్రశ్నించారు. చాలా టోల్‌గేట్‌లలో సిబ్బందికి కనీసం గుర్తింపు కార్డులు కూడా మంజూరు చేయలేదన్నారు. జాబ్ ఆర్డర్ కూడా ఇవ్వలేదన్నారు. 20 ఏళ్లుగా పనిచేస్తున్నా ఎలాంటి ప్రమోషన్లూ లేవన్నారు. ఫాస్ట్ ట్యాగ్ వల్ల పని మరింత కఠినమైందన్నారు పెరిగే ధరలుకనుగణంగా కనీస వేతనం రూ.20వేలకు పైగా ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం ఎఐటియుసిజిల్లా కన్వీనర్ కె.రాంబాబు మాట్లాడారు. సిబ్బందికి ఇంక్రిమెంట్లు ఇఎస్ఐ, పిఎఫ్ సక్రమంగా అమలు చేయాలన్నారు. ఈ సమావేశంలో అల్యూమినియం క్రిష్ బిల్ నాయకులు వి.కొండలరావు, ఎఐటియుసి నగర నాయకులు ఎంఎస్.రాజు తదితరులు పాల్గొన్నారు. అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. గౌరవ సలహాదారుగా కె.రాంబాబు, గౌరవ అధ్యక్షులుగా తాటిపాక మధు, అధ్యక్షులుగా కె.చినబాబు, ఉపాధ్యక్షులుగా రామ్మూర్తి తదితరులు ఎన్నికయ్యారు.

సమావేశంలో పాల్గొన్న నాయకులు

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
తూర్పుగోదావరి, కోనసీమ జిల్లాల సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 94432
కాకినాడ, కోనసీమ జిల్లాల సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99189

ఎంఎల్‌సి ఇజ్రాయేల్ పర్యటన జయప్రదానికి పిలుపు

ప్రజాశక్తి - ఉప్పలగుప్తం

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాల ఎంఎల్‌సిగా గెలుపొందిన బొమ్మి ఇజ్రాయేల్ ఈనెల 28న తొలిసారిగా డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లాకు వస్తున్న సందర్భంగా ఘన స్వాగతం పలికేందుకు వైసిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తరలిరావాలని మాదిగ పొలిటికల్ జెఎసి నాయకులు పిలుపునిచ్చారు. ఉప్పలగుప్తం పంచాయతీ పెద్దూరు బాబూ జగ్జీవన్ రామ్ కమ్యూనిటీ హాల్ లో ఆదివారం పొలిటికల్ జెఎసి సమావేశం చెట్ల విద్యాసాగర్ అధ్యక్షతన నిర్వహించారు. 28వ తేదీ మధ్యాహ్నం జిల్లా ముఖద్వారమైన రావులపాలెం కు చేరుకుని అక్కడ నుంచి విజయోత్సవ ర్యాలీ జరిపి అమలా పురం మీదుగా ఇజ్రాయేల్ స్వగ్రామమైన అల్లవరం మండలం గోడి చేరుకుంటారన్నారు. కార్యక్రమంలో పొలిటికల్ జెఎసి నాయకులు తొత్తరమూడి నరసింహారావు, సత్తాల దుర్గారావు, చెట్ల శ్రీను, తదితరులు పాల్గొన్నారు.